క్లుప్తంగా

పోలీస్ సంక్షేమ దివస్



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: పోలీస్ సిబ్బంది స్వేచ్ఛగా ప్రజలకు సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నామని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన సంక్షేమ దివస్‌ను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న పోలీస్, ఏఆర్ సిబ్బంది, హోంగార్డులు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ భరోసా కల్పించారు. సంక్షేమ దివస్‌లో ప్రధాన కార్యాలయ అధికారి స్మాలన్‌రాజు, సిబ్బంది ఉన్నారు.

కోర్టు ఫీజు స్టాంపుల కొరతను నివారించాలి

ఏలూరు (టూటౌన్): కోర్టు ఫీజు స్టాంపుల కొరతను నివారించి అన్ని డినామినేషన్స్‌లో కోర్టు ఫీజు స్టాంపులు సరఫరా చేయాలని ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదుల గుమస్తాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లా రాము కోరారు. ఈమేరకు శుక్రవారం అసోసియేషన్ తరుపున జిల్లా రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో వివిధ కోర్టు ఫీజు స్టాంపులు దొరకక చాలా కాలంగా కోర్టులో లాయర్లు, లాయర్ల గుమస్తాలు, కక్షిదారులు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నట్టు పేర్కొన్నారు. దీంతో కోర్టు ఫీజు స్టాంపులు అన్ని డినామినేషన్స్‌తో ఉన్నవి త్వరితగతిన సరఫరా చేయాలని కోరారు.

మీటర్ రీడర్ల క్యాలెండర్ విడుదల



క్యాలెండర్ విడుదల చేసిన ఎస్ఈ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ మీటర్ రీడర్స్ ఉపాధికి నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని, మీటర్ రీడర్స్‌ను విద్యార్హతలు బట్టి విద్యుత్ శాఖలో వివిధ పోస్టులను కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు ఈపీడీసీఎల్ ఏలూరు ఎస్ఈ పి.సాల్మన్ రాజుకు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ముద్రించిన 2025 క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో విద్యుత్ సంస్థ సాల్మన్ రాజు విడుదల చేశారు. విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ప్రతినెలా వేతనాల కోసం ఎస్కో అకౌంట్స్‌ను ప్రారంభించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఒ.శ్రీనివాసరావు, కె.మల్లేశ్వరరావు, జి.దుర్గారావు, పి.జాకబ్, డి.శంకర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించిన కర్పూరీ ఠాగూర్



మాట్లాడుతున్న లంకా వెంకటేశ్వర్లు

ఏలూరు (టూటౌన్): దేశంలో తొలిసారిగా మహిళలకు, బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన గొప్ప వ్యక్తి భారత రత్న, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాగూర్ అని రాష్ట్ర బీసీ జేఏసీ అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు కొనియాడారు. స్థానిక హనుమాన్ నగర్‌లోని నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో కర్పూరీ ఠాగూర్ శత జయంతి ముగింపు కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేడు దేశంలోనే పేరు గాంచిన లాలూ ప్రసాద్ యాదవ్,రాం విలాస్ పాశ్వాన్,నితీష్ కుమార్‌లు కర్పూరీ ఠాగూర్ శిష్యులే అని గుర్తు చేశారు. ఎం నరేంద్ర అధ్యక్షత వహించిన కార్యక్రమంలో నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, చిలకలపల్లి కట్లయ్య, తెంటు సూర్యనారాయణ, బేతాళం సుదర్శన్, కాగిత అచ్యుత్, ఫ్లాష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్లకు అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా స్థానిక సీఆర్ఆర్ అటానమస్ కళాశాలలో నగరంలోని కళాశాల బస్సుల డ్రైవర్లు, సహాయకులు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనాలను జాగ్రత్తగా నడిపే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాలెందు శేఖర్, విఠల్, ప్రసాద్ రావు, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు అజ్మీరా బద్దు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడి మరమ్మతులు

- నెలలోపే యథావిధిగా గోతులు ప్రత్యక్షం
- నాణ్యత డొల్ల.. పైకి లేచిన కంకరు
- ఇదీ ఏలూరు రోడ్ల పరిస్థితి
- ముక్కున వేలేసుకుంటున్న ప్రజలు



ఏలూరు గూడ్స్ షెడ్డు సమీపంలో దర్శనమిస్తున్న గోతులు



ఆర్ఆర్‌పేట ట్రాక్ రోడ్డుపై ఉన్న గోతులు

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం పని చేసేది గోరంత.. ప్రచారం కొండంత అనే చందంగా తయారైంది. ఇందుకు ఇటీవల రోడ్ల మరమ్మతు పనులే నిదర్శనం. ఏలూరు నగరంలో గత రెండు నెలల్లో రోడ్లు మరమ్మతులు చేస్తున్నట్టు ఫొటోలకు, పత్రికలకు ఫోజులిచ్చి మరీ నాయకులు ఆర్భాటం చేశారు. తీరా పూడ్చిన నెల తిరక్కుండానే యథావిధిగా గోతులు దర్శనమివ్వడం పట్ల స్థానికులు విస్తుపోతున్నారు. పాత బస్టాండ్ నుంచి తూర్పులాకుల వరకు వెళ్లే రహదారిలో రెండు వైపులా గోతులను కంకర, తారుతో పూడ్చారు. నెలతిరక్కుండానే గోతులు ప్రత్యక్షమవటంతో మొక్కుబడిగా అక్కడక్కడా గోతులను పూడ్చి సొమ్ములు దండుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మొదటి సమావేశంలోనే ఆర్భాటం

రోడ్ల మరమ్మతులకు గత పాలకులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఈ పనులకు తాము రూ.400 కోట్లు ఖర్చు చేయనున్నట్టు రాష్ట్ర కేబినెట్ తొలి సమావేశంలోనే ఆర్భాటంగా ప్రకటించారు. ప్రకటించిన నాలుగు నెలలకు గానీ నిధులు కేటాయించలేదు. మొక్కుబడిగా నిధులు కేటాయించి చేపట్టిన పనుల్లో నాణ్యత లోపం బయట పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు పూర్తి కావస్తున్నా గొప్పలు చెప్పుకోవడం తప్ప పనులు ఎక్కడ వేసిని గొంగళి అక్కడే ఉన్న విధంగా నగరంలో పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు.

ఏలూరులో రూ.1.25 కోట్లతో పనులు

ఏలూరునగర పాలక సంస్థ పరిధిలో మొత్తం రూ.1.25 కోట్ల అంచనాలతో 600 రోడ్లలో మరమ్మతులు చేపట్టినట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించారు. హడావుడిగా నవంబరు, డిసెంబరు నెలల్లో ప్రధాన, నిత్యం జనం రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లలో మరమ్మతులు చేపట్టారు. దీంతో ఆనందపడ్డ ప్రజల ఆశ మూడు నాళ్ల ముచ్చటగానే మిగిలింది. నెల తిరక్కుండానే తిరిగి పూడ్చిన చోట్ల గోతులు ప్రత్యక్షం కావడంతో జనం నోరెళ్లబెడుతున్నారు.

తూతూ మంత్రంగానే పనులు

నగరంలోని బిర్లా భవన్ సెంటర్, గడియార స్తంభం సెంటర్, పెరుగుచెట్టు సెంటర్, కాంగ్రెస్ జిల్లా కార్యాలయం రోడ్డు, ఎస్‌బీఐ బజార్ బ్రాంచి రోడ్డు ఇలా నగరంలోని టూటౌన్, వన్‌టౌన్ ప్రాంతాల్లో పలుచోట్ల రోడ్ల మరమ్మతు పనులు నిర్వహించారు. గోతుల్లో ప్రసాదం మాదిరిగా తారు రాయడంతో కంకర, చిప్స్ వెంటనే పైకి లేచిపోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఇచ్చే మామూళ్ల కారణంగా పనుల్లో నాణ్యత కొండెక్కిందంటూ పలువురు ఆరోపిస్తున్నారు. పాత బస్టాండ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్‌లోనూ పూడ్చిన గోతులు మళ్లీ దర్శనమిస్తున్నాయి.

నాణ్యతా లోపం



నగరంలో పూడ్చిన గోతులు నెల తిరక్కుండానే మళ్లీ దర్శనమివ్వడం నాణ్యతా లోపం కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. పాత బస్టాండ్ వద్ద పూడ్చిన గోతులు మళ్లీ గుంటలు పడుతున్నాయి. ఓవర్ బ్రిడ్జి డౌన్లో పూడ్చిన గొయ్యి మళ్లీ గుంటగా మరడంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలు స్కిడ్ అవుతున్నాయి. పనుల్లో నాణ్యత పాటించాలి.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

మరింత అధ్వానం



నెలతిరక్కుండానే కంకర పైకిలేచి గోతులు గతం కన్నా మరింత అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆటోవాలాలు, ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదమరిస్తే ప్రమాదాల బారిన పడుతున్నారు. మొక్కుబడిగా కాకుండా పూర్తి నాణ్యతతో పనులు చేపట్టాలి. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

– జె.గోపి, సీఐటీయూ నగర నాయకులు, ఏలూరు

పనుల్లో నాణ్యత ఉండాలి



ఏలూరు 50 డివిజన్లలో ఉన్న అన్ని రోడ్లకు తక్షణం మరమ్మతులు చేపట్టాలి. ఆర్భాటాలు మాని వాస్తవంగా పనిచేసి చూపించాలి. రోడ్లపై ప్రయాణించాలంటేనే నగర ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాలకులు సత్వర చర్యలు చేపట్టాలి. చేసిన పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– బి.సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు, సీఐటీయూ, ఏలూరు

కొద్ది రోజులకే గోతుల దర్శనం



నగరంలోని రోడ్ల మరమ్మతులకు రూ.1.25 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. చేసిన పనుల్లో ఎక్కడా నాణ్యత కనబడటం లేదు. మరమ్మతులు చేపట్టిన రోడ్లు, గోతులు పూడ్చిన కొద్ది రోజులకే అవి పైకి లేచిపోయి దర్శన మిస్తున్నాయి. మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. అప్పుడే ప్రజల బాధలు తీరతాయి.

– బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు, ఏలూరు

గోపాలకృష్ణమూర్తికి అభినందన



గోపాలకృష్ణమూర్తిని అభినందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ద్వారకాతిరుమల మండలం గుండుగొలనుకుంటకు చెందిన ఓటిలిశెట్టి గోపాలకృష్ణమూర్తికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. సుబ్రహ్మణ్యేశ్వర ప్రకృతి వనరులు, శిక్షణా కేంద్రం ద్వారా కషాయాలు తయారు చేస్తూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆయనకు అంతర్జాతీయ యోగ్యత కేంద్రం, జైవిక్ ఇండియా అవార్డు–2025ను ప్రకటించింది. ఈ నెల 22న బెంగుళూరులో ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిశారు. గోపాలకృష్ణమూర్తిని కలెక్టర్ వెట్రిసెల్వి అభినందించారు. ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు, షేక్ హబీబ్ బాషా, ఏలూరు జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ బి.వెంకటేష్ తదితరులు గోపాలకృష్ణమూర్తిని అభినందించారు.

నేడు పింఛన్ల పరిశీలన

ఏలూరు (టూటౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని దివ్యాంగుల పింఛన్ల పరిశీలనలో భాగంగా శనివారం అంధుల విభాగంలోని 60 మందిని ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పరిశీలించనున్నట్టు కమిషనర్ ఎ.భాను ప్రతాప్ తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్ల పరిధిలో మొత్తం 3,902 వివిధ్న ప్రతిభావంతుల పింఛన్లు ఉన్నట్టు చెప్పారు. వీరిలో అంధుల కేటగిరిలో 306 మంది నెలకు రూ.6 వేలు చొప్పున పింఛన్లు అందిస్తున్నట్టు తెలిపారు. ముందుగా 60 మందిని ఈ నెల 25న శాంపిల్ సర్వే చేస్తామని, అనంతరం మిగిలిన వారిని పరిశీలిస్తామని వివరించారు. ఇప్పటికే నగర పాలక సంస్థ పరిధిలో నెలకు రూ.15 వేలు హెల్త్ పింఛన్లను అందుకుంటున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన వైద్యుల ప్రత్యేక బృందాలు వారిని పరిశీలించడం జరిగిందన్నారు.

ఆడ పిల్లలను బతకనిద్దాం



వేధింపుల నుంచి మమ్మల్ని కాపాడంటూ బాలికల నృత్యరూపకం

ఆడపిల్లలను బతకనివ్వండంటూ విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యరూపం ఆకట్టుకుంది. ఆడపిల్లలు ఎదుర్కొంటున్న అత్యాచారాలు, వేధింపులు, భ్రూణహత్యలు నుంచి కాపాడాలని, సమాజంలో తమకు గుర్తింపు ఇవ్వాలని విద్యార్థులు మూకీ ప్రదర్శన, బాలికలపై జరిగే అరాచకాలను నృత్యరూపంలో చూపించారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఏలూరు సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రదర్శనలవి. – సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



సేవ్ గర్ల నాటిక



లంబాడి నృత్యం



భ్రూణహత్య నుంచి రక్షించాలని మూకీ ప్రదర్శన

హెల్మెట్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి. చిత్రంలో ఎస్పీ కేపీఎస్ కిషోర్

ఏలూరు(మెట్రో): జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలపై వచ్చే ఉద్యోగులు ఫిబ్రవరి 1 నుంచి తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రావాల్సిందేనని కలెక్టర్ కె. వెట్రిసెల్వి స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఇప్పటికే అన్ని స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తొలిగా ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలపై వచ్చే ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రావాలనే నిబంధన ఫిబ్రవరి 1 నుంచి అమలు అమలు చేయాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలకు వచ్చే వాహనదారులు హెల్మెట్ ధరించి రాకపోతే నో ఎంట్రీ అని స్పష్టం చేయాలన్నారు. ఈ విషయంపై ఆయా కళాశాలల యాజమాన్యాలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ కెపీఎస్ కిషోర్ మాట్లాడుతూ స్పీడ్ లిమిట్ దాటి బస్సు నడిపే డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనరు కె.ఎస్.ఎం.వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ధారణ

2025–26 కు సంబంధించి వివిధ పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ధారించినట్లు కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వ్యవసాయ, మత్స్యశాఖ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలకు సంబంధించి వివిధ రకాల రుణాల మంజూరు కోసం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ధారించినట్లు చెప్పారు. సమావేశంలో డీసీసీబీ సీఈవో తిలక్ నారా, నాబార్డ్ డీడీఎం పి.అనీల్‌కాంత్, ఎల్‌డీఎం డి.నీలాద్రి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.కె.హబీబ్ బాషా, ఉద్యానశాఖ డీడీ ఎస్.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

25న జాతీయ ఓటర్ల దినోత్సవం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఏలూరులో ఈ నెల 25న ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ నెల 25న ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నామని, ఓటుహక్కు నమోదు, వినియోగంపై, ఓటుహక్కు ప్రాముఖ్యతపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు విజేతలకు బహుమతులు అందిస్తారన్నారు.

గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు



షాపుల కేటాయింపు నిర్వహిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో గీత కార్మికులకు మొత్తం 14 షాపులను లాటరీ విధానంలో కేటాయించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో లాటరీ తీశా రు. గౌడ సామజిక వర్గానికి నూజివీడు మున్సిపాలిటీ పరిధిలోని షాపు, చింతలపూడి రూరల్ ప్రాంతంలోని షాపులు, ఏలూరు మున్సిపల్ కార్పొరేష న్, టి.నర్సాపురం, దెందులూరు, జంగారెడ్డిగూడెం రూరల్ పరిధిలో షాపులు, శెట్టిబలిజ సామజిక వర్గానికి జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ, చింతలపూడి, చాట్రాయి, ముసునూరు, మండవల్లి, నిడమర్రు, అగిరిపల్లి, కొయ్యలగూడెం మండలాల పరిధిలోని షాపులను కేటాయించారు. దరఖాస్తుకు గడువు ఫిబ్రవరి 5 వరకు ఉందని, ఫిబ్రవరి 7 ఉదయం 10 గంటలకు లాటరీ పద్ధతిన దరఖాస్తుదారులను ఎంపిక చేసి షాపులను మంజూరు చేస్తామన్నారు.

30న పరిశ్రమల అభివృద్ధి అధికారి రాక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళలకు బనానా ఫైబర్ ప్రాజెక్టు గురించి అవగాహన కలిగించేందుకు, పరిశ్రమల స్థాపనకు అవసరమైన రుణం అందించే నిమిత్తం కోయంబత్తూరుకు చెందిన ఏకో గ్రీన్ యూనిట్ నుంచి పరిశ్రమల అధికారి ఎస్‌కే బాబు ఈ నెల 30న నగరానికి రానున్నట్టు నగరానికి చెందిన కొరాళ్ల వల్లి తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్ 97423 63099లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బాలికలకు బంగారు భవితనిద్దాం

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బాలికలకు సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా భరోసా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక సెయింట్ థెరీస్సా మహిళా కళాశాలలో జిల్లా మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ బాలికా దినోత్సవాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్థానిక అమరావతి సెంటర్ నుంచి సెయింట్ థెరిస్సా కళాశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంతకాల సేకరణలో కలెక్టర్, ఎమ్మెల్యే బడేటి చంటి సంతకాలు చేశారు. ఆడపిల్లలను సంరక్షించి విద్యావంతులను చేస్తామని ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల భద్రతకు ఎక్కడైనా భంగం కలిగితే వెంటనే 1098 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బాలికలు ప్రదర్శించిన లంబాడీ ఫోక్ డ్యాన్స్, ఆడపిల్లలను సేవ్ చేసే థీమ్, అరుపు సాంగ్ వంటివి అబ్బురపరిచాయి. వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలైన బాలికలకు కలెక్టర్ మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో సెయింట్ థెరీస్సా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, ఆర్డీఓ అచ్యుత అంబరీష్, సీడీఎస్ పీడీ పి.శారద, డీసీపీఓ సూర్యచక్రవేణి, జిల్లా యువజన అధికారి దూలం కిషోర్, డీఎస్‌డీఓ శ్రీనివాసరావు, డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు వి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళలు, బాలికలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, వారి కోసం రూపొందించిన చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని రిటైర్డ్ జడ్జి అడబాల లక్ష్మి సూచించారు. స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో బాలికలకు రాజ్యాంగ పరమైన భద్రత అనే అంశంపై కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఐక్యూసీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రతినిధులు జడ్జి లక్ష్మిని సన్మానించారు. కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సరళ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఇందిరా కాలనీ ఎంపీ యూపీ స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బాలికల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో బాలికా సంరక్షణ, పోషణ, విద్య అంశాల పైన అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థినిపైనా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యతో పాటు వారి ఆహారం, ఆరోగ్యం, సంరక్షణ పైనా దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో డి.నాగరత్నం, డిస్ట్రిక్ట్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ బి.నవీన, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, సీడబ్ల్యూసీ ఇన్‌చార్జి చైర్మన్ పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అపుస్మా క్రీడల విజేతలకు అభినందన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అపుస్మా ఏలూరు జోన్ క్రీడల పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా నగరానికి చెందిన శ్రీ సూర్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ నిలిచిందని పాఠశాల డైరెక్టర్ కొండపల్లి చంద్ర శేఖర్‌రావు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా తమ పాఠశాల ఓవరాల్ ఛాంపియన్‌గా నిలుస్తుండడం సంతోషదాయకమన్నారు. విజేతలను, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.

జలతరంగణి ఆటల పోటీలు

ఏలూరు రూరల్ : ఏఎస్సార్ స్టేడియంలో ఇరిగేషన్‌శాఖ శుక్రవారం జలతరంగణి క్రీడోత్సవాలు నిర్వహించింది. డివిజన్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దేవ ప్రకాష్ రెండు రోజుల పోటీలను ప్రారంభించారు. విజయవాడ, ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ ఉద్యోగులు పాల్గొన్నారు. క్రికెట్, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని జిల్లా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ వివరించారు. పోలవరం కుడికాలువ డీఎస్ఈ రాజు మాట్లాడారు.

కోయ గిరిజనులకు న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): జీలుగుమిల్లి మండలం సిరివారిగూడెం కోయగిరిజనులకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డికి సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరుపున జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సిరివారిగూడెంలో 14.70 ఎకరాల భూమిని గత 30 ఏళ్లుగా స్థానిక గిరిజనులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఇటీవల గిరజనేతర భూస్వామి కోడూరు కృష్ణవేణి సదరు భూమిని తాను కొనుగోలు చేశానని గిరిజనులను సాగును అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. తహసీల్దార్, ఆర్డీఓల నుంచి ప్రొటెక్షన్ ఆర్డర్లతో పోలీసుల సహకారంతో భూమిలోకి ప్రవేశించి గిరిజనులను భీతావహులను చేస్తున్నారని వివరించారు. వేసిన పంటను అక్రమంగా దున్నేశారని, దీనిపై పలుమార్లు న్యాయం చేయమని మండల అధికారులను కోరినా ఫలితంలేదని తెలిపారు. గిరిజనులు సాగు చేస్తున్న భూమికి రక్షణ కల్పించాలని, ఉభయుల రికార్డులను పరిశీలన చేయాలని, ఏకపక్షంగా చట్ట విరుద్ధంగా అధికారులు ఇచ్చిన ప్రొటెక్షన్ అర్డర్లను రద్దు చేయాలని, గిరిజనులకు న్యాయం చేయాలని రవి డిమాండ్ చేశారు.